

అదిగో నవలోకం..
నగర వాసులకు నవలోకం ఆహ్వానం పలుకుతోంది. విభిన్న రుచులు, వైవిధ్యభరితమైన కార్యక్రమాలతో ఆకట్టుకుంటోంది. - 8లో



విద్యార్థికి గాయాలపై దర్యాప్తు
కిల్లోయి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి గాయంపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. హెచ్‌ఎం, వార్డె న్, కుక్‌లను బాధ్యులుగా గుర్తించారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	38°	23°
ఇచ్ఛాపురం	38°	24°
పలాస	37°	23°
టెక్కలి	37°	23°
పాతపట్నం	37°	23°
నరసన్నపేట	38°	24°
శ్రీకాకుళం	39°	24°

రంజాన్ వేళలు

ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
6.14	4.20

న్యూస్‌రీల్

మరో రెండు రోజులు పొడి వాతావరణం

ఆమదాలవలస: ఉత్తరకోస్తాలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు పొడివాతావరణం ఉంటుందని ఆమదాలవలస కృషివిజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ మానిక బుధవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 5వ వార్డు తాళ్లబద్ర రైల్వేగేటుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లబద్ర గ్రామానికి చెందిన పిండి దుర్యోధనరావు (32) స్కూటీపై బస్టాండ్ దాటుతుండగా వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి పలాస ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య జయలక్ష్మి, కుమార్తె యమున, కుమారుడు ధనుస్సు ఉన్నారు. కాశీబుగ్గ ఎస్‌ఐ గోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దర్యాప్తులో కచ్చితత్వం అవసరం



నెలవారీ సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : కేసుల దర్యాప్తుల్లో కచ్చితత్వం పాటిస్తూ పూర్తిస్థాయి ఆధారాలతో న్యాయస్థానాల ద్వారా ముద్దాయిలకు శిక్షపడేలా చూడాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ సమీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాల్లో ఫిర్యాదు అందిన వెంటనే నేరస్థలికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి, 60 రోజుల్లోగా దర్యాప్తు పూర్తిచేసి సంబంధిత పత్రాలన్నింటితో కోర్టులో దాఖలు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లో సాక్ష్యాధారాల సేకరణలో, సాక్షుల విచారణలో జాగ్రత్తలు పాటిస్తూ ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఆధారాలు పంపించాలన్నారు. ప్రతి కేసులో చిన్న ఆధారముంటుందని.. అదే మనకు ఆయుధంలా ఉపయోగపడి ఎంతటి కేసునైనా ఛేదించడానికి సులువవుతుందన్నారు. తీవ్ర నేరాలకు పాల్పడినవారిపై సిట్ ఓపెన్ చేయాలని, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు ఎం.మహేంద్ర, సీహెచ్ ప్రసాదరావు, జి.శ్రీనివాసరావు, డి.ప్రసాదరావు, పీఆర్వో భాస్కర్ పాల్గొన్నారు.

నిన్న పెట్రోల్ బంకులో బోయ్... నేడు ఉపాధ్యాయుడు

రాజాం/సంతకవిటి: సంతకవిటి మండలం మల్లయ్యపేట గ్రామానికి చెందిన పొన్నాడ పాపారావు ఎంఏ బీఈడీ పూర్తిచేశారు. డీఎస్సీ–98లో ఉద్యోగ అర్హత సాధించాడు. కోర్టు కేసులతో ఉద్యోగం రాలేదు. భార్య సుశీలతో కలిసి కూలి పనులు చేసుకునేవాడు. చివరికి పొందూరు వద్ద పెట్రోల్ బంక్‌లో బోయ్‌గా చేరాడు. ఎట్టకేలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయ కౌన్సెలింగ్‌లో పార్వతీపురం మన్యం జిల్లా కొటారికోట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. మరో ఆరేళ్ల సర్వీసు ఉన్న పాపారావు ఆనందానికి అవధులు లేవు. కౌన్సెలింగ్ పూర్తయిన వెంటనే పాపారావు రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును కలిసి ప్రభుత్వానికి, జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



నిన్నటివరకు పెట్రోల్ బంక్‌లో విధులు నిర్వహిస్తున్న పాపారావు



నేడు ఉపాధ్యాయుడిగా రాజాం ఎమ్మెల్యేతో ఆనందం పంచుకుంటున్న పాపారావు

టీడీపీ నేతల సెల్ఫీగోల్



నాటి కేంద్రమంత్రి కిల్లి కృపారాణి కేటాయించిన నిధులతో నిర్మించిన వంతెనను చూపిస్తున్న బొడ్డబడ గ్రామపెద్దలు

- కాంగ్రెస్ హయాంలో చేపట్టిన వంతెనను తమ ఖాతాలో వేసుకున్న టీడీపీ నేతలు
- అడ్డంగా బుక్ అయిన ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్
- సెల్ఫీ ప్రచారంపై అడ్డం తిరిగిన గ్రామస్తులు
- టీడీపీ నేతలు దిగజారిపోయారంటూ నిరసన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టీడీపీ నేతలకు సెల్ఫీ పిచ్చిపట్టింది. తమ హయాంలో జరిగిన ఘన కార్యమిది అని సెల్ఫీ ఫొటోలు దిగుతూ సామాజిక మాధ్యమాల్లో వదులుతున్నారు. తీరా వాస్తవాలు చూసేసరికి అడ్డంగా బుక్ అయిపోయి సెల్ఫ్ గోల్ అవుతున్నారు. తమ అధినేతలు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లను అనుసరించి ప్రజల చేత ఛీదరించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు సవాల్ చేసి, నిజాలు తెలుసుకున్నాక కంగుతింటున్నారు.

పాదయాత్ర నుంచి మొదలు..

లోకేష్ పాదయాత్ర చేపట్టినప్పటి నుంచి సెల్ఫీ రాజకీయాలు ప్రారంభించారు. ప్రతిచోటా సెల్ఫీలు దిగుతూ సామాజిక మాధ్యమాల్లో పెడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులకు సవాల్ విసురుతున్నారు. దీనికి వెంటనే వైఎస్సార్ సీపీ నేతలు, తటస్థులు, స్థానికులు దీటుగా బదులిస్తున్నారు. సెల్ఫీలో ఉన్నవి మీ ఘనకార్యం కాదని...అవన్నీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్..ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన కార్యక్రమాలని ఆధారాలతో పాటు అప్పటి ఫొటోలు పెట్టి రీట్వీట్ చేస్తున్నారు. దీంతో ఇప్పటికే చాలాసార్లు లోకేష్ కంగుతిన్నారు. ఇది చాలదన్నట్లు చంద్రబాబు సైతం సెల్ఫీ రాజకీయాలు మొదలు పెట్టారు. టీడీపీ హయాంలో అరకొర పనులు చేపట్టిన టిడ్కో గృహాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పూర్తి చేస్తే..వాటిని కాస్త తన ఖాతాలో వేసుకుని సెల్ఫీ తీసుకుని సవాల్ విసిరారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంటనే స్పందిస్తూ చంద్రబాబు హయాంలో పనులు ఎంత వరకు జరిగాయి.. వారెంత ఖర్చు పెట్టారు..ఇప్పుడెంత పనులు జరిగాయి..వీరెంత ఖర్చు పెట్టారన్న దానిపై ఆధారాలు, వ్యయాలు, ఫొటోలతో కలిపి చంద్రబాబుకు కౌంటర్ ఇచ్చారు. దీంతో చంద్రబాబు షాక్ తిన్నారు.



ఇప్పుడు జిల్లానేతల వంతు..

సెల్ఫీ పిచ్చి ఇప్పుడు టీడీపీ జిల్లా నేతల వంతు వచ్చింది. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సెల్ఫీ రాజకీయాలకు తెరలేపారు. ఇచ్ఛాపురం మండలం బొడ్డబడ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కేంద్రమంత్రిగా కిల్లి కృపారాణి ఉన్నప్పుడు రూ.7కోట్ల వ్యయంతో రోడ్ కమ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. పనులు ప్రారంభించాక కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయింది. టీడీపీ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ హయాంలోనే ఆ నిధులన్నీ మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులు కూడా చేపట్టారు. కిల్లి కృపారాణికి ఆ గ్రామస్తులు కృతజ్ఞతగా సత్కారం కూడా చేశారు. కానీ ఈ బ్రిడ్జి నిర్మాణం తమ ఘనత అంటూ.. ఇలాంటివి మీ హయాంలో జరిగాయా అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులకు సవాల్ విసురుతూ మంగళవారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు. రాజకీయంగా చూస్తే టీడీపీ నేతల సవాల్‌కు వైఎస్సార్‌సీపీ నేతలు స్పందించాలి. కానీ వారికన్నా ముందు బొడ్డబడ గ్రామస్తులే స్పందించారు. ఇది మీ గొప్పతనం కాదు.. కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేసిన కిల్లి కృపారాణి గొప్పతనమంటూ ఆ బ్రిడ్జి వద్ద సెల్ఫీ తీసుకుని ఎంపీ, ఎమ్మెల్యేలకు కౌంటర్ ఇచ్చారు. ఇందులో టీడీపీ గొప్పతనమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీకి సెల్ఫీ సవాల్ విసిరితే..

వైఎస్సార్‌సీపీ నేతలు గాని, సంబంధిత గ్రామస్తులు గాని తమ కళ్ల ముందు టీడీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ హయాంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సెల్ఫీలు తీసుకుని సవాల్ విసిరితే టీడీపీ నేతలు జవాబు చెప్పలేని పరిస్థితి ఉంది. గతంలో లేనట్టుగా ప్రతి గ్రామంలోనూ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు, పశు వైద్య క్లినిక్, అగ్రి ల్యాబ్‌లతో సెల్ఫీలు తీసుకుని సవాల్ విసిరితే టీడీపీ నాయకులు తట్టుకోలేని పరిస్థితి. ఇక, టీడీపీ హయాంలో చేపట్టిన నాసిరకం పనులు, నాణ్యత లేని రోడ్లు, వందల కోట్లు మేసేసి, అడ్డంగా దోచుకున్న నీరు చెట్టు పనులు, టీడీపీ హయాంలో చేపట్టిన నాణ్యత లేని రోడ్లు, ఇతర నిర్మాణాలపై సెల్ఫీలు తీసి సామాజిక మాధ్యమాలు, పత్రికలకు వదిలితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

చరిత్ర తెలుసుకుందాం...



చారిత్రక, పర్యాటక కేంద్రాల సందర్శనలో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీకూర్మనాథాలయాన్ని కె.మత్స్యలేశం బుద్ధా స్కూల్ యువ టూరిజం క్లబ్ సభ్యులు బుధవారం సందర్శించారు. ఆలయ విశిష్టతను ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు తెలియజేశారు. శిల్పకళ, వైష్ణవీ దుర్గాలయం, ఆకు పసర చిత్రాలు, లిపి, దేవుని వాహనాలను పరిశీలించారు. తాబేళ్ల పార్కును సందర్శించారు. –గార

మే 13న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మే 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌తో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. బుధవారం తన చాంబర్లో జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు రాజీ చేసుకోవడానికి కక్షిదారులను ఒప్పించాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, కార్యదర్శి చిన్నారావు, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, మహిళా ప్రతినిధి వేమూరి హరిప్రియ, భాస్కరరావు, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నమ్మకానికి నిలువుటద్దం..



విశ్వసనీయతకు, నమ్మకానికి చిరునామాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారని జనమంతా జేజేలు పలుకుతున్నారు. జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో అన్ని వర్గాల వారు రాష్ట్ర ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడున్న సంక్షేమం కొనసాగిస్తూ తమ భవిష్యత్ మరింత బాగుండాలంటే మళ్లీ జగనే సీఎంగా రావాలని ముక్తకంఠంతో నినదించారు.

– సాక్షి నెట్‌వర్క్

జగన్‌బాబుకే ఓటు..

మాకు పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్న జగన్‌బాబుకే ఓటు వేస్తాం. ఆయన వచ్చిన తరువాత అన్ని రకాలుగా బాగుంది. ఇంతకు మునుపు పింఛన్ ఇస్తే డబ్బులు అడిగేవారు. ఇప్పుడు ఒక్క పైసా కూడా తీసుకోకుండా పింఛన్ ఇస్తున్నారు.

– సార అప్పోజమ్మ(టెక్కలి మండలం గూడెం పంచాయతీ పిట్టలసరియాలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో..)

ఈబీసీ నేస్తం 2,632 మందికి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

- రూ.3.94 కోట్లను లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసిన సీఎం జగన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 2,632 మంది లబ్ధిదారుల ఖాతాలకు ఈబీసీ నేస్తం కింద ప్రభుత్వం రూ.3.94 కోట్లను జమ చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురంలో బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవం పెంచడమే ప్రభుత్వ ధ్యేయమని ఉద్ఘాటించారు.

- జిల్లా కేంద్రంలో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 2,632 మందికి ఈబీసీ నేస్తం వర్తించినట్లు ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా ఆమదాలవలసలో 176 మందికి రూ.26.40 లక్షలు, ఎచ్చెర్లలో 374 మందికి రూ.56.10 లక్షలు, ఇచ్ఛాపురంలో 620 మందికి రూ.93లక్షలు, నరసన్నపేటలో 138 మందికి రూ.20.70 లక్షలు, పలాసలో 410 మందికి రూ.61.50 లక్షలు, పాతపట్నంలో 335 మందికి రూ.50.30 లక్షలు, శ్రీకాకుళంలో 429 మందికి రూ.64.40 లక్షలు, టెక్కలిలో 150 మందికి రూ.22.50 లక్షలు వర్తించినట్లు వివరించారు. సామాజికవర్గాల వారీగా కాపులు 103 మంది, రెడ్డి 20 మంది, ఆర్యవైశ్య 332 మంది, బ్రాహ్మణ 1822 మంది, క్షత్రియ 74 మంది, వెలమ ఇద్దరు, ఇతర ఓసీలు 379 మంది ఉన్నారని తెలిపారు.
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కాకుండా ఇతర కులాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల వయసు గల మహిళలకు ఈబీసీ నేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ, డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి పి.వాసుదేవరావు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధి గుంట జ్యోతి, నాగలక్ష్మి, చౌదరి సతీష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా..



అగ్రకుల పేద మహిళలకు ఈబీసీ నేస్తం ద్వారా ఇచ్చిన ప్రోత్సాహంతో ఇంటి వద్దనే అప్పడాలు, ఒడియాలు చేసుకుంటూ చిరు వ్యాపారులుగా మారాం. వచ్చిన ఆదాయంతో పిల్లలను పోషించుకుంటున్నాం. ఇటువంటి ముఖ్యమంత్రి కలకాలం ఉండాలి.

– నాగవరపు రామలక్ష్మి, గుడివీధి, శ్రీకాకుళం

హామీ ఇవ్వకపోయినా..



నాడు ఎన్నికల ముందు ఈబీసీ పేదలకు ఆర్థిక సాయం అందిస్తామని మాట ఇవ్వకపోయినా ప్రభుత్వం వచ్చిన తరువాత అగ్రకులాల పేదలను గుర్తించి ఈబీసీ పథకంతో ఆదుకుంటున్నారు.ఇటువంటి గొప్ప దాతృత్వం జగనన్నకే దక్కింది. – తేనేటి భవానీ, శ్రీకాకుళం

జగనన్న పక్షమే..



మహిళా పక్షపాతిగా అన్ని సంక్షేమ పథకాలు మహిళలకే వర్తింపజేస్తూ సమాజంలో ప్రత్యేక గౌరవం కల్పిస్తున్నారు. ఈబీసీ నేస్తం పథకం ద్వారా లబ్ధి పొంది చిరు వ్యాపారులుగా, కుటుంబంలో కీలక వ్యక్తులుగా మహిళలు ఎదుగుతున్నారు.

– తేజోమూర్తుల కామేశ్వరి, శ్రీకాకుళం

ఫలించిన నిరీక్షణ

- ఫలించిన డీఎస్సీ–1998 అభ్యర్థుల చిరకాల కోరిక
- సీఎం జగన్ నిర్ణయంతో ఎట్టకేలకు పోస్టింగులు
- 352 మందికి గాను కౌన్సెలింగ్‌కు 19 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: డీఎస్సీ–1998 క్వాలిఫైడ్ అభ్యర్థుల పాతికేళ్ల నిరీక్షణ ఫలించింది. ఉద్యోగంపై ఆశలు వదులుకున్న దశలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఒకే ఒక్క నిర్ణయంతో అభ్యర్థుల జీవితాల్లో వెలుగులు నింపాయి. ఇప్పటి వరకు ఆరుగురు ముఖ్యమంత్రులు మారినా మారని వీరి తలరాతను సీఎం జగన్ ఎట్టకేలకు మార్చారు. మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) రూపంలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)లగా ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే వీరి నుంచి అంగీకార పత్రాలను తీసుకున్నారు. జిల్లాలో 352 మంది ఉద్యోగాలు చేసేందుకు సమ్మతి తెలియజేశారు. ఇందులో పురుషులు 316 మంది, మహిళలు 36 మంది ఉన్నారు. వీరి సర్టిఫికెట్ల సైతం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పరిశీలన పూర్తి చేసిన విషయం తెలిసిందే.

నియామక పత్రాలు అందజేత..


జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంగా బుధవారం రాత్రి 10 గంటల వరకు కౌన్సిలింగ్ చేపట్టి, నియామక పత్రాలు అందజేశారు. 352 మంది కౌన్సిలింగ్‌కు హాజరుకావాల్సి ఉండగా వివిధ కారణాలతో 19 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి గార పగడాలమ్మ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశారు.



అభ్యర్థికి నియామక పత్రాన్ని అందజేస్తున్న డీఈఓ గార పగడాలమ్మ


పారదర్శకంగా నియామకాలు..

అభ్యర్థుల నియామకాలను అధికారులు పారదర్శకంగా, పూర్తిచేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమక్షంలోనే ఓపెన్‌గా కౌన్సిలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు వారు ఎంచుకున్న మండలాల ప్రకారం ఖాళీ పోస్టులు ఉన్న పాఠశాలల వివరాలను భారీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. పోస్టింగ్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా మెజారిటీ (95 శాతం మంది) ఉపాధ్యాయులకు వారి సొంత మండలాల పరిధిలోనే ఉద్యోగాలు లభించడం విశేషం. 30 శాతం మందికి వారి సొంత పంచాయతీ/ గ్రామాల్లోనే ఉద్యోగాలు సాధించి అమితానందం పొందారు.



పాఠశాల ఎంచుకుని సంతకం చేస్తున్న అభ్యర్థి తాండ్ర గోవిందరావు (ఆమదాలవలస మండలం)


ఉద్యోగంపై ఆశలు వదిలేసుకున్నాం..



వాస్తవానికి మాకు ఉద్యోగాలు మళ్లీ వస్తాయని అనుకోలేదు. ఆశలు వదులుకున్నాం. ఉద్యోగం కలేనని భావించాం. ప్రభుత్వాలు, చట్టాలు చేయని పనిని ఒకే ఒక్క నిర్ణయంతో సీఎం జగన్ తలరాతలనే మార్చేశారు.

– ఎస్వీ వెంకటరమణ, హయాతినగరం, ఎచ్చెర్ల (పోస్టింగ్: గొల్లపేట ఎంపీపీ స్కూల్, ఎచ్చెర్ల మండలం)


మా ఇంట దీపం పెట్టారు..



ఆయన మాట ఇస్తే.. చేస్తాడంతే అని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురించి చెబుతూ ఉంటే ఏమో అనుకున్నాం. ఇచ్చిన మాట ప్రకారం మా ఇంట దీపం పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది డీఎస్సీ క్వాలిఫైడ్ 1998 అభ్యర్థులకు ఎంటీఎస్ ప్రాతిపదికపై ఎస్‌జీటీలుగా గుర్తించి ఉద్యోగాలు కల్పించారు. ఆయన మేలు మరువలేం.

– జోగి పురుషోత్తమరావు, వజ్రపుకొత్తూరు (పోస్టింగ్: బాతుపురం ఎంపీపీ స్కూల్)


మా జీవితాల్లో వెలుగులు నింపారు..



రాష్ట్రంలో ఆరుగురు ముఖ్యమంత్రులు మారారు. ఎన్నోసార్లు సీఎంలను కలిశాం. న్యాయం చేయాలని కాళ్లు అరిగేలా తిరిగాం. కానీ ఉద్యోగాలు కల్పించలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రం మా జీవితాల్లో వెలుగులు నింపారు.

– తాండ్ర గోవిందరావు, అక్కివరం, ఆమదాలవలస(పోస్టింగ్: జలిపినాయుడుపేట ఎంపీపీ స్కూల్, ఎచ్చెర్ల మండలం)

రుణపడి ఉంటాం..



నేను 1998 డీఎస్సీలో అర్హత సాధించాను. అప్పటి ప్రభుత్వం వివిధ కారణాలతో ఉద్యోగాలు కల్పించలేదు. రెండున్నర దశాబ్దాలపాటు ఉద్యోగాల కోసం నిరీక్షించాం. ఎట్టకేలకు సీఎం జగన్ మాకు దేవుడిలా వరం ఇచ్చారు. ఈ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– వంజరాపు కవీశ్వరరావు, పాతపట్నం (పోస్టింగ్: పాతపట్నం ఎంపీపీ స్కూల్)

మాట ఇచ్చారు.. నిలబెట్టుకున్నారు..



నేను కొండవలస గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తున్నాను. నాడు ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో మానాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని పాదయాత్ర సమయంలో కలిశాం. 1998 డీఎస్సీ బాధితుల సమస్యను వివరించాం. నాడే మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలిచ్చారు.

– తుమ్మి వెంకటరమణ, కొండవలస సర్పంచ్, రేగిడి(పోస్టింగ్: కొండవలస ఎంపీపీ స్కూల్)

టీచర్‌గానూ రాణిస్తా..



టీచర్‌గా రాణించాలనేది నా కోరిక. అయితే కళారంగంపై ఉన్న ఆసక్తితో జబర్దస్త్‌లో చేరి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నాను. సీఎం జగన్ నిర్ణయంతో నాకూ ఉద్యోగం లభించింది. ఎస్‌జీటీ టీచర్‌గా రాణిస్తాను.

– పేడాడ గణపతిరావు, జబర్దస్త్ ఫేం, ఆమదాలవలస, (పోస్టింగ్: సంతకొత్తవలస, ఎంపీపీ స్కూల్)

క్లుప్తంగా

పీజీ సెట్ కన్వీనర్‌కు కోర్సుల వివరాలు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర పీజీ సెట్ నిర్వహణకు సంబంధించి ఏయూ ప్రొఫెసర్ కె.రమణయ్యకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పీజీ కోర్సుల వివరాలు అందజేసినట్లు రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. రాష్ట్ర పీజీ సెట్ ఆధారంగా విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయంలో సైన్స్ కోర్సులకు సంబంధించి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు బయోటెక్నాలజీ, మైక్రోబయోలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, మ్యాథ్స్, అప్లైడ్ మ్యాథ్స్, ఫిజిక్స్, ఆర్ట్సుకు సంబంధించి ఎంకాం, ఎకనామిక్స్, ఇంగ్లిష్, ఎంఎల్‌ఐఎస్సీ, ఎంఈడీ, సోషల్ వర్కు, తెలుగు, రూరల్ డెవలప్‌మెంట్, ఎంజేఎంసీ ఉన్నట్లు చెప్పారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్సిటీలో పూర్తయిన పురుషుల వసతి గృహం భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

రూపాదేవికి ఉపాధ్యాయుల సత్కారం


రూపాదేవిని సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: పారా బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటిన సంతవురిటి గ్రామానికి చెందిన పడాల రూపాదేవిని అదే గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం సత్కరించారు. రూపాదేవి ఇదే పాఠశాలలో పదో తరగతి వరకూ చదివారు. ఐదో జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న ఆమె బంగారు, రెండు వెండి పతాకాలను సాధించారు. రెండు కాళ్లు లేకపోయినా ఈమె ప్రతిభపై ఈనెల పదో తేదీన 'పట్టుదలకు ప్రతి రూపం' శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. ఆమె ప్రతిభను కొనియాడారు.

డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా


ధర్నా చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఏపీజేఏసీ అమరావతి నాయకులు కోరారు. మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శ్రీకాకుళం జిల్లా జేఏసీ, అనుబంధ సంఘాల నాయకులు, ఉద్యోగులు నల్ల రిబ్బన్లు పెట్టుకుని శ్రీకాకుళం అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఉన్న రెవెన్యూ గెస్ట్ హౌస్ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఏపీ జేఏసీ శ్రీకాకుళం జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు, అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, జనరల్ సెక్రెటరీ రమణ, ఏపీ ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ రవాణా కట్టడికి సహకరించాలి

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల సమాచారం తెలిస్తే వెంటనే తమకు తెలియజేయాలని శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నాగేశ్వరరావు ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రామలక్ష్మణ కూడలి వద్ద అసోసియేషన్ సభ్యులు, డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో టీనేజీ యువత చిన్న చిన్న సరదాలకు పోయి మత్తు పదార్థాలను అలవాటు చేసుకుంటున్నారని చెప్పారు. అవి వారికి చేరకుండా ఉండాలంటే వాటి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడమే మంచి మార్గమన్నారు. ఆటోల్లో ఎవరైనా మిమ్మల్ని అడిగి గంజా, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలు తీసుకెళ్లమని చెబితే తమకు సమాచారమివ్వాలని కోరారు. సమాజసేవలో భాగంగా ఈ విషయంలో సహకరిస్తే భవిష్యత్తులో ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,670-00
బంగారం(22సి. 10గ్రా.)	54,700-00
వెండి (కిలో)	76,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రస్‌డ్	స్కిన్‌లెస్
₹105	₹165	₹ 185

మన జీవనం బిజీగా మారిపోయింది. తెల్లవారి లేచింది మొదలు.. రాత్రి నిద్రపోయే వరకు ఉరుకులు పరుగులే. ఉదయం లేవడం.. దైనందిన కార్యక్రమాలు ముగించుకుని.. ఉద్యోగ వ్యాపకాలకు పరుగులు తీయడం.. సాయంత్రమో రాత్రికి అలసి సొలసి గూటికి చేరుకోవడంతోనే సరిపోతుంది. అంతలోనే రాత్రి భోజనం, నిద్ర.. మళ్లీ తెల్లవారితే ఉరుకులు.. ఈ జీవనచక్రంలో చిక్కుకుపోయిన నగటు మనిషికి మానసిక ఉల్లాసం కరువవుతోంది. సరిగ్గా ఇటువంటి వారిని మరో లోకం ఆహ్వానిస్తోంది. సాయంత్రం దీపాల వెలుగులతోనే చైతన్యం నింపుకొని చీకటి రాత్రులను వెలుగుల రంగేళీగా మారుస్తోంది. నోరూరించే రకరకాల రుచులతో ఊరిస్తూ రారమ్మంటోంది. ఫ్లడ్ లైట్ల వెలుగులో ఔత్సాహిక క్రీడాకారుల ఉత్సాహానికి చక్కటి వేదికగా నిలుస్తోంది. అవును.. శ్రీకాకుళం నగరంలో ఇప్పుడు నిశి రాత్రి వేళ నవలోకం ఆవిష్కృతమవుతోంది. -శ్రీకాకుళం డెస్క్

అదిగో నవలోకం..

వెలిసే మనకోసం



వేసవి సాయంత్రం
విద్యుత్ వెలుగుల్లో
పద్మంలా ప్రతిబింబించే
పురాతన అలల నిలువుటద్దం
నా సిక్కోలు నగరం..

ఈ సాయంత్రం కాస్త ముదిరి చీకటి చిక్కబడుతున్న వేళ నగరంలో మరోపార్శ్వం ఆవిష్కృతమవుతోంది. ఓ వైపు అర్ధరాత్రి వరకు సాగే ఆటపాటల సందడి.. మరో వైపు రాక్ బ్యాండ్ హోరు.. జాజ్ మ్యూజిక్‌ల జోరు.. ఉదయమంతా తీరికలేని వ్యాపకాలతో బిజీగా గడిపే నగరవాసికి కొత్త రుచులు బహుపసందుగా దర్శనమిస్తున్నాయి.

● స్వరాలు ఊయలూగు వేళ..



పసందైన విందుతో పాటు వీనుల విందైన స్వరాలు ఆలకిస్తూ డిన్నర్ చేస్తే ఆ మజాయే వేరు కదా. ఆ సదుపాయం సిక్కోలు వాసులకు అందుబాటులోకి వచ్చేసింది. తమ రెస్టారెంట్‌కు వచ్చే ఫుడ్ లవర్స్‌కు లైవ్ ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు నిర్వాహకులు. రాక్ నుంచి జాజ్ వరకు అన్ని రకాల పాటల్ని వినిపిస్తూ భోజన, సంగీత ప్రియులతో శభాష్ అనిపించుకుంటున్నారు. ఔత్సాహికులైన కళాకారుల్ని ప్రోత్సహించేందుకు వేదికను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. మీలో ఉన్న కళను కూడా ఆ వేదికపై ప్రదర్శించే అవకాశాన్ని కూడా కల్పించారు.

ఇటీవలే నగరానికి చెందిన నృత్యకారుడు తన బృందంతో ఈ రెస్టారెంట్ వేదికపై ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు కూడా.

ఎక్కడ
శ్రీకాకుళం 80 అడుగుల రోడ్ చివరిలో..

వీనుల విందు..



ఓ వైపు ఇష్టమైన పాటలు.. మరో వైపు చక్కటి భోజనం.. ఎంజాయ్ చేస్తా. ఎంత ఒత్తిడిలో ఉన్నా ఇక్కడకు వచ్చే సరికి చాలా హాయిగా అనిపిస్తుంది. - కోరాద శంశాక్



● పాన్‌లో ఫైర్ ఉంది..

నగరంలో రాత్రి వేళ కిళ్లీ దుకాణాలు కళకళలాడుతుంటాయి. భోజనం అనంతరం తాంబూలం వేసే వాళ్లందరూ తమ కిష్టమైన కిళ్లీ రుచి కోసం ఎదురుచూస్తుంటారు. ఈ పాన్‌లలో కూడా బోలెడు రుచుల్ని సిక్కోలులో విక్రయిస్తున్నారు. వీటిని విక్రయించేందుకు రాజస్థాన్ నుంచి వచ్చిన వ్యాపారులు పాన్‌మహల్ పేరిట ప్రత్యేక దుకాణాల్నే ప్రారంభించారు. మిఠాయి కిళ్లీలతో పాటు ఫైర్‌పాన్‌ల విక్రయాలు బాగున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు.



● ఉత్తరాది రుచులు

పానీ పూరీ.. దహీపూరీ.. కఛోరీ చాట్.. సేవ్‌పూరీ.. దహీపాపిడీ.. ఆలూ టిక్కా రగడ.. మసాలా పావ్‌బాజీ.. ఇలా ఉత్తరాదిలో ఖ్యాతిగాంచిన వంటల మెనూతో చీకటిపడితే చాలు ఆ జంక్షన్ సందడిగా కనిపిస్తుంది. ఎల్‌ఈడీ వెలుగుల్లో ఫ్యామిలీలతో రుచుల్ని ఆస్వాదిస్తుంటారు నగరవాసులు.

ఎక్కడ
పాలకొండ రోడ్‌లోని గాంధీ పార్కు సమీపంలో..

పానీపూరీ తింటాం..



రోజూ పానీపూరీ తినే ఇంటికి వెళ్తా. శాకాహారం అంటే ఇష్టం. చాట్ ఐటెమ్స్ చాలా ఇక్కడ దొరుకుతాయి. అయితే కొంచెం రద్దీగా ఉంటుంది. - ఎం.భాగ్యలక్ష్మి, పీఎస్‌పేట

● అర్ధరాత్రి వరకూ ఆటాడుకుందాం రా..

ఆడాలని ఉంటుంది. కానీ ఆడలేరు. సమయం కేటాయించలేరు. పగలంతా ఉద్యోగ బాధ్యతలు. చీకటిపడితే తప్ప ఇంటికి చేరని పరిస్థితి. మరెప్పుడు ఆడాలి.. ఎక్కడ ఆడాలి. ఇలాంటి క్రికెట్ క్రీడా ప్రియులకు అర్ధరాత్రి వరకు ఆడే అవకాశం కల్పిస్తోంది ఓ సంస్థ. వికెట్‌ల నుంచి బ్యాట్‌ల వర కు అన్నీ వారే సమకూరుస్తారు. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో అర్ధరాత్రి వరకు ఆటాడుకుందాం రా.. అంటూ మీ క్రీడా సరదా తీసుకోవచ్చు. పనిలో పనిగా ఫిట్‌నెస్ పెంచుకోవచ్చు. అయితే టీమందరికీ కలిసి గంటకు రూ.700 వరకు చార్జీ చేస్తున్నారు. కూల్‌డ్రింక్స్, ఫుడ్ అదే ఆవరణలో విక్రయిస్తున్నారు.

ఎక్కడ
పీఎస్ఎన్ఎం స్కూల్ పక్క రోడ్డులో.. ఎగ్జిబిషన్ మైదానం ఆనుకుని..

సరదా తీరేదాకా..



ఉదయమంతా వ్యాపారం. ఇతర బాధ్యతలు. గ్రౌండ్‌కు వెళ్దామంటే వీలుకాదు. అందుకే వీలున్నప్పుడల్లా మా టీమ్‌తో వచ్చి ఇక్కడ కనీసం రెండు మూడు గంటలు.. క్రికెట్ ఆడతాం. -కె.ఉదయ్‌కుమార్

● నాగావళి చెంతన.. నెయ్యి ఇడ్లీ ఘుమఘుమ..



పొగలు కక్కే ఆవిరి సెగలతో ఇడ్లీలు చీకటికి వెల్‌కమ్ చెబుతాయి. వాటిపై మరుగుతున్న నెయ్యి వేసి.. కారం పొడి దట్టించి ఇష్టంగా లాగించేస్తుంటారు టిఫిన్ ప్రియులు. ఈ అల్పాహార అడ్డా రుచులకు ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. రాత్రి పదిన్నర దాటినా సందడిగా ఉంటుంది ఈ ప్రాంతం.

ఎక్కడ
కిమ్స్ ఆస్పత్రి నుంచి కొత్తబ్రిడ్జికి వెళ్లే దారిలో..

వేడిగా ఆరగిస్తే..



ఇడ్లీ చాలా బాగుంటుంది. వారానికి కనీసం ఒక్కసారైనా రుచి చూస్తా. నెయ్యి ఇడ్లీ ఇక్కడ హాట్‌ఫేవరెట్. దోసెలు కూడా.. -పెంట ఈశ్వరరావు

● మనసు దోసెయ్..



చీకటిపడితే చాలు కూడళ్లలో దోసెల పెనాలు సుయ్‌మని శబ్దం చేస్తూ అల్పాహార ప్రియుల ఆకలి తీర్చేస్తుంటాయి. పన్నీరు నుంచి ఎగ్ వరకు వివిధ రకాల దోసెల్ని తయారు చేసి వడ్డిస్తున్నారు నిర్వాహకులు. వీటి రుచుల్ని ఆస్వాదించాలంటే మాత్రం కొంచెం వేచిచూడాలి. ఎందుకంటే అవి విక్రయించే ప్రాంతాల్లో రద్దీ అంతగా ఉంటోంది మరి.

ఎక్కడ
పీఎస్ఎన్ఎం స్కూల్ పరిసరాలు.. సూర్య మహల్ జంక్షన్ సమీపంలో..

పన్నీర్ దోసె ఇష్టం..



రోజూ రాత్రి టిఫిన్‌కు వస్తుంటా. నగరంలోని కూడళ్లలో లభ్యమయ్యే పన్నీరు దోసె అంటే చాలా ఇష్టం. వీకెండ్స్‌లో చాలా రద్దీగా ఉంటుంది. -జి.వెంకట ఆదిత్య

భవన నిర్మాణ కార్మికుడిపై దాడి


రక్తం మడుగులో రమణయ్య

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు వంజరాపు రమణయ్యపై బుధవారం రాత్రి దాడి జరిగింది. జమ్ముకు చెందిన ముద్దాడ కన్నయ్య ఈ దాడికి పాల్పడ్డట్లు రమణయ్య భార్య నాగమణి(నాగమ్మ) పోలీసులకు తెలిపారు. కన్నయ్య అకారణంగా తన భర్తపై ఇనుపరాడ్లతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడని, మరుగుతున్న ఆయిల్ శరీరంపై పోశాడని వాపోయింది. బాధితుడ్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రమణయ్య ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నారు. పల్లిపేట రోడ్డులో ముద్దాడ కన్నయ్య.. రమణయ్య బంధువుకు చెందిన షాపులో అద్దెకు ఉంటూ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. షాపు ఖాళీ చేయాలని కోరగా వివాదం జరిగినట్లు తెలుస్తోంది. భవన నిర్మాణ పని పూర్తయిన తరువాత బుధవారం రాత్రి షాపు వద్దకు రమణయ్య వెళ్లగా ఇద్దరూ ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. కన్నయ్య కోసం పోలీసులు గాలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ వై.సింహాచలం ఆస్పత్రికి వెళ్లి ఆరా తీశారు. బాధితుడి భార్య తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

పోర్టు స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ దువ్వాడ


పోర్టు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ తదితరులు

సంతబొమ్మాళి:

భావనపాడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో విశ్వసముద్ర ఎండీ అనిల్‌కుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. విష్ణుచక్రం, మూలపేట తీరప్రాంతాల్లో భూమిపూజ, పైలాన్ ఆవిష్కరణ, సీఎం హెలిప్యాడ్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం నౌపడలో ఆర్అండ్‌బీ కాలనీ కోసం సేకరించిన భూమిలో భారీ బహిరంగసభకు స్థల పరిశీలన చేశారు. ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ చలమయ్య, ఏపీ మారిటైంబోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ప్రజల్లో విశేష ఆదరణ


మాట్లాడుతున్న కృష్ణ, ప్రసాద్

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ బాగుందని శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, పొట్నూరు ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రతి లబ్ధిదారుడు జగనన్న పట్ల సదాభిప్రాయంతో ఉన్నారన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ అని లబ్ధిదారులు అంటున్నారని పేర్కొన్నారు. అలాగే నరసన్నపేట ప్రాంతంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పట్ల కూడా ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. పార్టీ నాయకుడు కణిత కృష్ణారావు ఉన్నారు.

చెప్పు కోసం ఆటోలోంచి గెంతేసిన యువకుడు

● తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలైన వైనం



టెక్కలి రూరల్: ఆటోలో ప్రయాణిస్తున్న యువకుడు తన కాళ్ల చెప్పు పడిపోవడంతో సడన్‌గా అందులో నుంచి దూకేయడంతో తీవ్రగాయాలపాలై ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగాం మండలం కాపుతెంబూరు గ్రామానికి చెందిన టి.శ్రీనివాసరావు వ్యక్తిగత పనుల నిమిత్తం బుధవారం టెక్కలి వచ్చాడు. పనులు ముగించుకుని ఆటోలో గ్రామానికి బయలు దేరాడు. ఆటో వెనుక కూర్చొని ఉన్న శ్రీనివాసరావు కాళ్ల చెప్పు ఒకటి నందిగాం మండలం తామరాపల్లి గ్రామసమీపంలో కిందకు జారి పడిపోయింది. అయితే చెప్పు కోసం వేగంగా వెళ్తున్న ఆటో నుంచి దూకేయడంతో తల వెనుక బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అతన్ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

● వచ్చే నెల నుంచి బోట్లు, వలలకు 75శాతం రాయితీ పెంపు
● స్వదేశీ మైదాన మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సీదిరి అప్పలరాజు


స్వదేశీ మైదాన మత్స్యకార సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి అప్పలరాజు, ఎమ్మెల్యే కృష్ణదాస్

పోలాకి: రాష్ట్రంలో మత్స్యకారుల బతుకులను మార్చిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం పోలాకిలో స్వదేశీ మైదాన మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారుల సమస్యలపై మాట్లాడితే తోకలు కత్తిరిస్తానంటే.. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మనకు మంత్రి పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. మత్స్యకారులను పార్లమెంట్‌కు, అసెంబ్లీకి పంపిన చరిత్ర ఒక్క వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. భావనపాడు పోర్టు నిర్మాణంతో జిల్లా ముఖచిత్రం మారిపోతుందన్నారు. వచ్చే మే నుంచి మత్స్యకారులకు ఇచ్చే వలలు, బోట్లు కొనుగోలుకు 75 శాతం రాయితీ అందించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మత్స్యకార ప్రజానీకం వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ మత్స్యకారులతో పాటు అనేక వెనుకబడిన సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి ఉనికిని చాటిచెప్పిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, సర్పంచ్ మజ్జి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి గాయాలపై ఏటీడబ్ల్యూఓ దర్యాప్తు

మందస: కిల్లోయి గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన సంఘటన సంచలనంగా మారింది. ఉపాధ్యాయులు ప్రమాదంగా చెబుతున్నప్పటికీ.. విద్యార్థిని వంటకు వినియోగించడంతోనే సంఘటన జరిగినట్టు అధికారుల దర్యాప్తులో తేలింది. దీనిపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారికి నివేదికలు ఇవ్వనున్నట్లు దర్యాప్తు అధికారి చెప్పారు. దర్యాప్తులో వెల్లడైన వాస్తవాలను ఏటీడబ్ల్యూఓ ఎం.శ్రీనివాసరావు వివరించారు. కిల్లోయికాలనీ జీటీడబ్ల్యుఏహెచ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టి.గోపి.. ఆశ్రమంలో పని చేస్తున్న కుక్ చిట్టయ్య వంట పనికి పిలడంతో తరగతి నుంచి వెళ్లాడు. అన్నం దించుతుండగా బరువు మోయలేక గంజిలో పడిపోయాడు. ఈ నెల 5న ఘటన జరుగగా హెచ్ఎం కె.మదన్‌మోహన్, డిప్యూటీ వార్డెన్ ఎస్.శ్రీరాములు, కుక్ చిట్టయ్య రహస్యంగా ఉంచారు. మందసలో ఉన్న ఏటీడబ్ల్యూఓకు , ఐటీడీఏ డిప్యూటీ ఈఓ, డిప్యూటీ డైరెక్టర్, పీఓలకు తెలియజేయలేదు. స్థానికంగా ఓ ఆర్ఎంపీతో వైద్యం చేయించారు. వైద్యం వికటించడంతో గోపి చేయికి ఇన్‌ఫెక్షన్ సోకింది. గోపికి తండ్రిలేకపోవడంతో పలాసలో ఉంటున్న తల్లి సీతకు ఫోన్లో మాట్లాడించి, తనకు బాగానే ఉందని ఉపాధ్యాయులు చెప్పించారు. పరిస్థితి చేయి దాటుతుండడంతో చివరకు డీడీ బి.నగేశ్‌కు తెలియజేయడంతో ఆయన ఆగ్రహించి, తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. దీంతో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇప్పటికే ఎంఈఓ మర్రిపాటి లక్ష్మణరావు దర్యాప్తు చేయగా, బుధవారం మందస ఏటీడబ్ల్యూఓ ఎం.శ్రీనివాసరావు ఆశ్రమంలో సుదీర్ఘంగా దర్యాప్తు నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, కుక్, డిప్యూటీవార్డెన్, హెచ్ఎంలను విచారించారు. పలాసలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థి గోపి వద్దకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు.